క్లుప్తంగా

ఎమ్మెల్యే గాంధీ ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే గాంధీ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌యస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రగతి భవన్‌లో బీ ఫారమ్ అందుకున్న సందర్భంగా సోమవారం వివేకానందనగర్ డివిజన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, ఆయన సతీమణి శ్యామల దేవితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రోజాదేవి రంగారావు, నార్నే శ్రీనివాసరావు, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

పటాన్‌చెరు టౌన్: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు.అమీన్‌పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డిపేట, జానకంపేట గ్రామాలకు చెందిన అసంఘటిత రంగ కార్మికులు ఆదివారం రాత్రి జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ లో చేరారు .కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు కృష్ణ, పాండు,మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాద బ్రహ్మోత్సవం

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న నాద బ్రహ్మోత్సవం కార్యక్రమంలో రెండవ రోజు సోమవారం డాక్టర్ శోభారాజు శిష్య బృందం శ్రీవిష్ణుసహస్ర స్తోత్రం, అన్నమాచార్య స్తోత్రంలతో అలరించారు. నేపథ్య గాయకుడు సాందీప్ అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. వీరికి సంగీత సహకారాన్ని తబలాపై నోవా, కీబోర్డుపై రాజు అందించారు. కళాకారులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వి.జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

అయ్యప్పల మహా పాదయాత్ర ప్రారంభం



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: అయ్యప్పస్వాముల మహా పాదయాత్ర సోమవారం ప్రారంభమైంది. నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయం వద్ద గురుస్వామి బసవేశ్వరస్వామి ఆధ్వర్యంలో గురుస్వాములు ముత్యంరెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ పర్యవేక్షణలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాపాదయాత్ర 1,175 కిలోమీటర్లు సాగి నవంబర్ 19వ తేదీ శబరిమలకు చేరుతుందన్నారు.

ఫ్రెషర్స్ డే



హఫీజ్‌పేట్: చందానగర్‌లోని ప్రజ్ఞ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు సోమవారం ఎస్ఎన్ రెడ్డి గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, కరెస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాలలో కూడా రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయలక్ష్మి, కో ఎడ్ ప్రిన్సిపల్ సుమలత, డైరెక్టర్ నరేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రోగులకు మరింత చేరువగా వైద్యం

సాక్షి, సిటీబ్యూరో: వైద్యులు తమ సేవలను రోగులకు చేరువ చేసేందుకు వీలుగా ప్రముఖ వైద్య పరికరాల సంస్థ...హెల్త్ ఫ్లిక్స్ ఎలక్ట్రానిక్ మెడికల్ రికార్డ్స్ (ఇఎంఆర్) నిర్వహణ కోసం ఆఫ్‌లైన్ ఇఎమ్ఆర్‌ను నగరంలో అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీని ద్వారా వైద్యులు ఇంటర్నెట్ అంతరాయాలతో సంబంధం లేకుండా 24గంటలూ రోగులకు అందుబాటులో ఉండేందుకు వీలవుతుందన్నారు.

బాలాత్రిపురసుందరిగా రాజరాజేశ్వరి





బాలాత్రిపురసుందరీ దేవిగా రాజరాజేశ్వరిమాత



శివసాయిక్షేత్రంలో చండీహోమం

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, చండీహోమాలు

రాయదుర్గం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకారం, అభిషేకాలు చేస్తున్నారు.

- గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి మాత బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.
- గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. బాలాత్రిపురసుందరి దేవి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలో ఉదయం 8.30 గంటలకు మండప పూజ, చండీ పారాయణం, చండీహోమాన్ని అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు.
- రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోగరహిత జీవనం యోగాతోనే సాధ్యం



శిబిరంలో మాట్లాడుతున్న డా.పరమార్థ దేవ్

శేరిలింగంపల్లి: రోగ రహిత జీవనం యోగాతోనే సాధ్యం అని పతంజలి యోగా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పరమార్థదేవ్ అన్నారు.సోమవారం శేరిలింగంపల్లి తారానగర్ విద్యానికేతన్ స్కూల్‌లో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో ఆసనాలు, ప్రాణయామం చేయించారు. పరమార్థ దేవ్ మాట్లాడుతూ రోజు వారీ జీవితంలో ఆహారం, నీరు, నిద్ర నియమాలు విధిగా పాటించాలన్నారు. మనం తీసుకొనే ఆహారంలో పాలు, పెరుగు, నెయ్యి, ఆకు, కాయకూరలు, పండ్లు చేర్చాలని సూచించారు. పూర్వీకుల ఆచార వ్యవహాలు పూర్తి స్థాయిలో తిరిగి వాడుకలోకి తిరిగి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ జీ, సంఘటన మంత్రి నందనం కృపాకర్, ఉపాధ్యక్షులు శివ కుమార్, పతంజలి యోగ సమితి రాష్ట్ర అధ్యక్షులు శివుడు, వెస్ట్ జోన్ అధ్యక్షులు విఠల్, యోగా ప్రచారకులు అశోక్ ఆర్య, రామముని, వెస్ట్ జిల్లా బీఎస్‌టీ ఉపాధ్యక్షులు నూనె సురేందర్, యువ భారత్ అధ్యక్షులు పుట్ట వినయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ అవార్డ్స్- 2023

మాదాపూర్: మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం రాత్రి హైబిజ్ టీవి హెల్త్‌కేర్ అవార్డ్స్- 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణలో అత్యుత్తమ సేవలు అందించిన డాక్టర్లకు అవార్డులను అందజేశారు. కాంటినెంటల్ హాస్పిటల్ సీఎండి డాక్టర్ గురు.ఎన్ రెడ్డికి లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందజేశారు. వివిధ కేటగిరిలలో 45 లెజెండరీ డాక్టర్లు, 15 ఆస్పత్రులతో పాటు 8 మంది వైద్య నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో భారత మాజీ క్రికెటర్ అర్షద్ అయూబ్, డాక్టర్ కె.రాజేశ్వరరావు రిటైర్డ్ ఐఎస్, డాక్టర్ డిటి నాయక్ రిటైర్డ్ అదనపు డీజీపి , సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి, మల్లారెడ్డి హెల్త్ సిటీ ఎండి డాక్టర్ సీహెచ్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న డా. గురు.ఎన్ రెడ్డి

అందుబాటులో 'మొబిలిటీ ఛైర్'



కార్యక్రమంలో సినీనటుడు రాహుల్‌దేవ్, హర్ష

మాదాపూర్: మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో ఆదివారం పర్సనల్ మొబిలిటీ సర్వీసెస్ మోడల్ సీ2 సాంకేతికతో కూడిన మొబిలిటీ కుర్చీని సినీనటుడు రాహుల్‌దేవ్, హర్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనిని నడపడం చాలా సులభమని తెలిపారు. ఒక వ్యక్తి ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడికి వెళ్ళవచ్చని, క్లిష్టమైన మలుపులలో కూడా సులభంగా తిరగవచ్చని తెలిపారు. లియాన్ బ్యాటరీతో 5గంటల పాటు చార్జింగ్‌తో 18 కిలోమీటర్లు డ్రైవింగ్ చేయవచ్చని తెలిపారు. మోడల్ ఎఫ్ కూడా విడుదల చేసినట్టు తెలిపారు. బుకింగ్ కోసం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీ మేళా, బతుకమ్మ, దసరా ఉత్సవాలలో చేనేత హస్తకళా ఉత్పత్తులను సందర్శకులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సోమ వారం కథక్, భరతనాట్య ప్రదర్శనతో కళాకారు లు ఆకట్టుకున్నారు. బెంగుళూరుకు చెందిన కళాకారులు ధనిక, శాన్వి, రాహుల్, ముక్త, రేవంత్, హేమ, లక్ష్మీలు భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. తత్వమసి సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ గురువు మిథా శిష్యబృందం కథక్ ప్రదర్శించారు.



యువత చూపు బీఆర్‌ఎస్ వైపు..



పార్టీలో చేరిన యువతతో ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షులు, సీఎం కేసీఆర్ సారథ్యంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజనలోని సైబర్ వ్యాలీ, కృష్ణ కాలనీ ,మాదాపూర్‌కు చెందిన పలువురు యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో బీజేపీ, కాంగ్రెస్‌లు ఖాళీ అవుతున్నాయని పేర్కొన్నారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేయాలని, ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, రమేష్ రెడ్డి, దామోదర్, రాము, గోపీ, విష్ణు, అశోక్ రెడ్డి, సాయి, చైతన్య, మహిపాల్ పాల్గొన్నారు.

బీ ఫామ్ అందుకున్న గాంధీ



కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫామ్ అందుకుంటున్న శేరిలింగంపల్లి అభ్యర్థి గాంధీ

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శేరిలింగంపల్లి అభ్యర్థి ఆరెకపూడి గాంధీ బీ ఫామ్ అందుకున్నారు. ఎమ్మెల్యే గాంధీ పుట్టిన రోజు ఆదివారం రాత్రి ప్రగతిభవన్‌లో బీ ఫామ్ అందించడం గమనార్హం. పార్టీ తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని, శేరిలింగంపల్లిలో మూడోసారి భారీ మెజారిటీతో గెలిచి కేసీఆర్‌కు కానుకగా అందిస్తానని గాంధీ పేర్కొన్నారు.

డీఆర్‌సీ సెంటర్ల పరిశీలన



గచ్చిబౌలి స్టేడియంలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతి హోళికేరీ

గచ్చిబౌలి: సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ భారతి హోళి కేరి పరిశీలించారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, ఇబ్రహీంపట్నం సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన డీఆర్‌సీ కేంద్రాలను అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. జిల్లాలోని మొత్తం ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ కోసం అనువైన భవనాలు, గదులను పరిశీలించారు. లీకేజీలు ఏమైనా ఉన్నాయా అన్నది క్షుణ్ణంగా పరిశీలన జరపాలని తన వెంట ఉన్న ఆర్ అండ్ బీ ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాలకు సంబంధించిన డీఆర్సీ సెంటర్‌ను సందర్శించిన వారిలో కందుకూరు, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి ఆర్డీఓలు, డీసీపీ శ్రీనివాసులు ఉన్నారు. అదే విధంగా గచ్చిబౌలి స్టేడియం సందర్శనలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ డీసీపీ సందీప్ ఉన్నారు. అదే విధంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం పరిశీలనలో జోనల్ కమిషనర్ పంకజ, డీసీపీ సాయిశ్రీ, హయత్‌నగర్ డీసీ రవీందర్ తదితరులు ఉన్నారు.

వాహన తనిఖీలు.. రూ.32 లక్షలు స్వాధీనం

మాదాపూర్: మాదాపూర్‌లోని కాకతీయ హిల్స్ వద్ద వాహనాలను ఆదివారం తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు బ్యాగులో రూ. 32 లక్షల నగదు తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకుని ఆర్‌ఓకి అప్పజెప్పామని మాదాపూర్ సీఐ ఎస్.తిరుపతి తెలిపారు.

రూ.10 లక్షలు సీజ్

గచ్చిబౌలి: వాహనాలు తనిఖీల్లో రూ.10 లక్షల నగదును గచ్చిబౌలి పోలీసులు సీజ్ చేశారు. సోమవారం సాయంత్రం ఇందిరానగర్‌లో తనిఖీలు చేస్తుండగా బైక్ పై వెళుతున్న రఘు వద్ద ఉన్న బ్యాగ్‌లో రూ.10 లక్షలు గుర్తించారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో జిల్లా ఎన్నికల ఐటీ బృందానికి నగదును అందజేసినట్లు సీఐ జేమ్స్ బాబు తెలిపారు.

రూ.8 లక్షల 8 వేలు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురంలో ఇక్రిశాట్ సమీపంలో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా ఇద్దరు వ్యక్తులు కారులో తీసుకు వెళ్తున్న రూ.8 లక్షల 8వేల 430 నగదును పోలీసులు పట్టుకున్నారు.

బీసీలకు న్యాయం చేసేది బీజేపీనే..

- దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు
- 100వ రోజు 'గడపగడపకు రవన్న ప్రజాయాత్ర' బహిరంగ సభ



పాపిరెడ్డి కాలనీలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

హఫీజ్‌పేట్: బీసీలకు న్యాయం చేసే పార్టీ బీజేపీ ఒక్కటేనని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. 100వ రోజు గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర చందానగర్‌లోని పాపిరెడ్డికాలనీలో నిర్వహించిన అనంతరం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరై మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ తలపెట్టిన ప్రజాయాత్ర విజయవంతమయిందన్నారు. ప్రజలు బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రస్తుత ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ గత 10 సంవత్సరాలలో 9వేల కోట్లు ఖర్చు చేసి నియోజకవర్గంను అభివృద్ధి చేశానని చెబుతున్నాడని, కానీ ఇక్కడ అలాంటి అభివృద్ధి కనబడడం లేదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని భూములన్నీ అమ్మేస్తున్నారని శేరిలింగంపల్లిలోని భూములను వేలంలో వందల కోట్లకు విక్రయిస్తున్నారన్నారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వమంటే డబ్బులు లేవు, ప్రగతి భవన్ కట్టుకోవడానికి వందల కోట్లు వస్తాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గ్రూప్ 1, 2, కానిస్టేబుల్, డీఎస్సీ వంటి నోటిఫికేషన్లు, పరీక్షలు వాయిదా వేసి నిరుద్యోగ యువత ఆత్మహత్యకు పాల్పడేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఒక్క లిక్కర్ నోటిఫికేషన్ మాత్రం విజయవంతంగా పూర్తి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ రవికుమార్ పేద ప్రజలకు అండగా నిలుస్తాడని, అతనిని దీవించాలని కోరారు.

మంచి పనులెన్నో చేశాం.. ఆశీర్వదించండి

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ



కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీ, కార్పొరేటర్లు తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌యస్ నాయకులు, కార్యకర్తలతో ఆస్‌బెస్టాస్ కాలనీలోని రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో నియోజకవర్గంలో 9 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌యస్ పార్టీకి శ్రీరామరక్ష అని తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతికి తోడ్పడే విధంగా బీఆర్‌యస్ పార్టీ మ్యానిఫెస్టో ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



చందానగర్ క్రిస్టల్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న నాయకులు

- కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నంనాయుడు
- పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

హఫీజ్‌పేట్: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బూత్‌స్థాయి నుంచి కష్టపడాలని కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోజీ నాగరావ్‌లు పేర్కొన్నారు. సోమవారం చందానగర్ క్రిస్టల్ గార్డెన్స్‌లో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఎవరికి అవకాశం ఇచ్చినా నిబద్ధతతో పని చేయాలని, శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా రెపరెపలాడే దిశగా కష్టపడాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జెల యోగానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, కొరదాల నరేష్, రాష్ట్ర నాయకులు మొవ్వ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, రాఘవేంద్రరావు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, డివిజన్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలి



కేశవనగర్‌లో రఘునాథ్‌యాదవ్‌కు హారతి ఇస్తున్న స్థానికులు

- బీఆర్‌ఎస్‌కు ఇస్తే దేశాన్ని, రాష్ట్రాన్ని కూడా లూటీ చేస్తారు
- శేరిలింగంపల్లి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్

రాయదుర్గం: బీఆర్‌ఎస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో మరోసారి అవకాశం ఇస్తే దేశాన్ని, రాష్ట్రాన్ని కూడా లూటీ చేస్తారని శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌లో సోమవారం రాత్రి గడపగడపకూ రఘన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలన ముసుగులో తండ్రి, కొడుకు, బిడ్డతోపాటు అల్లుళ్ళు రాష్ట్రాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేశారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అధికారం కల్పిస్తే సుపరిపాలన అందుతుందన్నారు. మరో 45 రోజుల్లో రాష్ట్రంలో ప్రభుత్వం మారుతుందని, భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



ప్రొ.ఉదయ్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: స్టార్టప్‌లు విజయవంతం కావడానికి అనువైన వాతావరణం సృష్టించాలని ఐఐటీ హైదరాబాద్ వ్యవస్థాపక మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉదయ్ బి దేశాయ్ పేర్కొన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ డే టాక్ కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో సోమవారం సాయంత్రం 'భారతీయ విశ్వవిద్యాలయాల్లో వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను నిర్మించడం–పెంపొందించడం' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మార్కెట్ యాక్సెస్, పరిశోధనపై విలువైన మార్గదర్శకాలను అందించగల అనుభవజ్ఞులైన మెంటర్లతో పరస్పరం సంభాషించడానికి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించడంలో భారతదేశం ముందుండాలన్నారు. హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ భారతదేశం అంతటా విద్యాసంస్థల్లో వ్యవస్థాపక శక్తిని వెలికి తీసేందుకు ఇదే మంచి సమయమన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై కూడా దృష్టి పెట్టేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీఐఈయూ డైరెక్టర్, ప్రొఫెసర్ జీఎస్‌ప్రసాద్, హెచ్‌సీయూ ఎస్పైర్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్ హెడ్ ప్రొఫెసర్ రాజగోపాల్, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుండి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శంకర్ కథనం ప్రకారం... పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన వడ్డే హనుమంతు సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.దీంతో భార్య దేవమ్మ స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా భర్త ఆచూకీ లభించ లేదు.దీంతో భర్త అదృశ్యంపై భార్య దేవమ్మ సోమవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.